# మనోధర్మం

మొగ్గ సంపూర్ణంగా విచ్చుకుంటేనే సౌరభంతో కూడిన సౌకుమార్యం ఇనుమడిస్తుంది. చూసే అందరికీ అది ఆనందం కలిగిస్తుంది. మొక్క ఏపుగా పెరిగి శాఖోపశాఖలై విస్తరిస్తేనే 'కల్పవృక్షం'గా పేరు పొందుతుంది. చంద్రుడు ఆకాశాన దేదీప్యమానంగా వెలిగితేనే, ఆ పున్నమి ఆహ్లాదభరితం. సృష్టిలో ఏదైనా వికసిస్తేనే, దానికి పరిపూర్ణత సిద్ధించినట్లు! దాని నుంచే జ్ఞాన, మనో వికాసాలు వెల్లివిరుస్తాయి. శాస్త్రం, సాంకేతికం వంటి ఏ అంశంలోనైనా ప్రయోగపూర్వకంగా అభ్యసిస్తూ ముందుకు సాగేవారే అనుభవజ్ఞులవుతారు. జ్ఞానులుగా మారతారు. భక్తి కూడా అంతే!

మనసు ముడుచుకొని ఉన్నంత కాలం సాధకుడు పరిణతి సాధించలేడు. దేవుణ్ని పసుపు, కుంకుమ, గంధం, పూలతో అలంకరించి; దీపాలు పెట్టి, ధూపాలు వెలిగించి, నైవేద్యం సమర్పించగానే సరిపోదు. షోడశోపచారాలు చేసినంత మాత్రాన, ఆ పూజ ఫలవంతమైనట్లు కాదు. వాటన్నింటితో పాటు, అటు ఇటు చరించే మనసును అతడు కుదురుగా కూర్చోబెట్టాలి. మనసుకు గురి ముఖ్యం. ఎదురుగా ఉన్నది భగవంతుడన్న భక్తిప్రపత్తులతో వ్యవహరించాలి. మనసా వాచా కర్మణా ధ్యాన నిమగ్నం కావాలి. దానికి నిష్ఠ అవసరం.

భగవత్ సాన్నిధ్యంలో అనిర్వచనీయ అనుభూతి కలుగుతుంది. లౌకిక ప్రపంచాన్ని ఆ కొద్దిసేపూ మరవడమే పూజార్హత. పూజావిధానంపై సాధకుడికి పట్టు చిక్కితే, భగవంతుడు అతడి మనసుకు చేరువైనట్లే! అనేకమంది తీర్థులు, దాసులు, ఆచార్యులు నిరంతర ధ్యాసవల్లనే స్వామికి చేరువయ్యారు. అలౌకికానందంతో వారు పులకించిపోయారు. ఆధ్యాత్మిక రంగంలో ఎందరికో మార్గం చూపిన మహానుభావులయ్యారు.

పిల్లలు బంకమట్టితో బొమ్మను చేస్తే, వాస్తవ ఆకారంతో దానికి పోలిక లేకున్నా ఆకర్షణ ఉంటుంది. దాన్ని రూపొందించడానికి వారు పడిన తపన, చూపిన ఏకాగ్రత ముచ్చట గొలుపుతాయి. సాధకుడి కృషీ ఎందరినో ప్రభావితం చేస్తుంది.

కాలక్రమంలో ఆధ్యాత్మికత్వానికి సమయం, డబ్బు శాసనకర్తలవుతున్నాయి! మనిషి అనుభూతుల్ని అవి కబళిస్తున్నాయి. పూజ చేయడంలోని రమణీయతనూ అవే క్షీణింపజేస్తున్నాయి.



# అంతర్యామి

నిర్మల తటాకం వంటి మనసుదే ప్రధాన పాత్ర. దాన్ని ప్రశాంతంగా ఉంచుకోవాలి. నిత్య సాధనతో వికాసం సాధించగలగాలి. ఏదో ఒకనాటికి సంపూర్ణ వికసిత మనో పుష్పాన్ని స్వామి చరణార్పణం చేస్తేనే, మానవ జన్మ సార్థకమవుతుంది.

పూజ అనేది తప్పించుకోలేని, తప్పనిసరి వ్యవహారం కాదు. ఎవరైనా చిన్న సహాయం చేసినందుకే, మనిషి కృతజ్ఞత చెబుతాడు. అలాంటిది- చరాచర సృష్టిలోని ఏ జీవ, జంతుజాలానికీ లేని ప్రత్యేకతల్ని దైవం ప్రసాదించినందుకు మనిషి ఎన్ని ధన్యవాదాలు సమర్పించాలి? జ్ఞానేంద్రియాలతో గ్రహించి అర్థం చేసుకునే విచక్షణ శక్తిని కలిగించాడు దేవుడు. కర్మేంద్రియాలు అనుగుణంగా వ్యవహరించడం వల్ల, జీవితానికి సార్థకత కలిగే అవకాశం కల్పించాడు. అందుకే దేవదేవుడికి ధన్యవాదాలు సమర్పించడం మానవుడి కనీస ధర్మం. అలా చేసినందువల్ల అతడు ఏ సందర్భంలోనూ 'నేను' అనే అహానికి లోను కాడు. 'నాది' అనే గర్వంతో విర్రవీగడు.

సృష్టి యావత్తు దైవ ప్రసాదంగా అందరికీ చెందుతుందన్న భావమే పరమ ఉత్కృష్టం. దాన్ని పెంపొందించుకోవడమే మనిషి పరమ లక్ష్యం. అప్పుడు- ఈ భూమి ఓ దేవాలయమవుతుంది. మనిషికి, దేవుడికి మధ్య గల తెర తొలగిపోతుంది!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు